వేములవాడ: అంబేద్కర్ విగ్రహం వద్ద జై భీమ్ అంటూ నినదిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకుడు మనోహర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్: అంబేద్కర్ విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

మహనీయుడు అంబేద్కర్

- జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- అడుగుజాడల్లో నడవాలని పిలుపు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. మహనీయుడి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

– వేములవాడ/సిరిసిల్ల టౌన్/చందుర్తి/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/కోనరావుపేట/ ముస్తాబాద్/ గాంధీ చౌక్/సిరిసిల్ల రూరల్/ వేములవాడ రూరల్/ఇల్లంతకుంట, ఏప్రిల్ 14

సిరిసిల్ల టౌన్: తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, నాయకులు

- జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కలెక్టర్ అనురాగ్ జయంతి, బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకులు ఆకునూరి శంకరయ్య, న్యాలకొండ రాఘవరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, ఆర్డీవో రమేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, డీపీవో వీరబుచ్చయ్య, డీవైఎస్‌వో రాందాస్ పాల్గొన్నారు.
- వేములవాడలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగిమహేశ్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, గోలి మహేశ్, వేములవాడ డివిజన్ ఆటో సంఘం అధ్యక్షుడు దేవరాజు, నాయకులు రామతీర్థపు రాజు , కుమ్మరి శ్రీనివాస్, ముద్రకోల వెంకటేశం, పోతు అనిల్, సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మైలారపు రాము పాల్గొన్నారు.
- గంభీరావుపేట మండల పరిషత్‌లో ఎంపీపీ వంగ కరుణ, గోరంటాలలో జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘాలు, ఆయా పార్టీల నాయకులు కేక్ కట్ చేసి మహనీయుడికి ఘన నివాళులర్పించారు. ఇక్కడ ఎంపీడీవో రాజేందర్, వైస్ ఎంపీపీ దోసల లత, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఎంపీవో రాజశేఖర్, ఆయా పార్టీల మండలాధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, గంట అశోక్, హఫీద్, తదితరులు ఉన్నారు.
- కోనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళుర్పించారు. ధర్మారంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు.
- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఎన్గందుల అనసూయ, అంబేద్కర్ సంఘం నాయకులు గడ్డం జితేందర్, కర్రోల్ల ఎల్లయ్య, ఎన్గందుల నర్సింహులు, లింగాల దాసు, తదితరులు ఉన్నారు.
- ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఇక్కడ అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నేతలు చాకలి రమేశ్, దేవరాజు, రాజారామ్, ఎల్లం, మల్లయ్య, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.
- సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఇక్కడ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటి, కార్యదర్శి నాగరాజుగౌడ్, న్యాయవాదులు ధర్మేందర్, రవీందర్‌రావు, అంజయ్య, విష్ణు, అనిల్, కర్నాకర్, అన్సారీ, మహేందర్, రాజయ్య, శేఖర్, రాజేశ్, కళ్యాణి, తదితరులు ఉన్నారు.
- తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. వేడుకల్లో ఎంపీపీ పడిగెల మానస పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో నాయకులు మాట్ల మధు, బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, గజభీంకార్ రాజన్న, జాలగం ప్రవీణ్, మాట్ల శంకర్, రాజనర్సు, పడిగెల రాజు, ఎగుమామిడి వెంకటరమణా రెడ్డి, కోడం రమణ, కోయ్యడ రమేశ్, సిరిసిల్ల పరశురాములు, గుగ్గిళ్ల ఆంజనేయులు, వంశీ, గనప మదన్, శివజ్యోతి, లింగం ఉన్నారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ విలీన గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, రెడ్యానాయక్, చెన్నమనేని కీర్తి, బొలగం నాగరాజు, పోచవేని సత్య, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మి, ఒగ్గు ఉమ, పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్, నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, గండ్ర రమేశ్‌రావు, జూపల్లి శ్రీనాథరావు, ఎరవెల్లి వెంకటరమణా రావు, కిరణ్, శ్రీనివాసరావు, నారాయణ గౌడ్, ఉలిచె తిరుపతి, దేవయ్య ఉన్నారు. అదేవిధంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 17వ పోలీస్ బెటాలియన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అనుపురంలో జడ్పీటీసీ మ్యాకల రవి, బీజేపీ నాయకులు ఎర్రం మహేశ్, శాత్రాజుపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు అంబేద్కర్ వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. అలాగే విలీన గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో కౌన్సిలర్లు విజయ, హన్మవ్వ, విజయ్, లక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.
- చందుర్తి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మాల మహానాడు, ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, మాల మహానాడు మండలాధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, నాయకులు గొట్టె ప్రభాకర్, పులి సత్యం, నీరటి ప్రసాద్, మార్త సత్తయ్య, పొంచెట్టి రాకేశ్, తదితరులు ఉన్నారు.
- ఇల్లంతకుంట మండలం పొత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, మధు, శేఖర్, కుమార్ ఉన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.
- వీర్నపల్లి మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్, ఉపసర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బోయిని రవి, నేతలు శ్రీరాంనాయక్, భగవంతం, తిరుపతి, అంబేద్కర్ సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.
- రుద్రంగి తహసీల్ కార్యాలయంతో పాటు మానాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇక్కడ ఆర్ఐ నవీన్, వైస్ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, మాజీ సర్పంచులు ప్రభలత, మనోహర్, అల్లూరి మానస, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, నేతలు రాజరాం,గంగరాజం, అరుణ్, లింగం, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించి, మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలకు తగ్గట్లుగా విధులు కొనసాగించాలని సూచించారు.

ఎల్లారెడ్డిపేట: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: పొత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు

గాంధీచౌక్: అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న న్యాయవాదులు

వడ్లు కొనేదెన్నడు?

- పేరుకే సెంటర్ల ఓపెనింగ్..
- ప్రారంభంకాని ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ
- ఆకాశంలో మబ్బులతో అన్నదాతల్లో గుబులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ గ్రామంలోని సబ్‌మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

యాసంగి సీజన్‌లో జిల్లాలో 1.78లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐకేపీ, సింగిల్ విండో, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 259 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 236 కుపైగా కేంద్రాలను ప్రారంభించనప్పటికీ, ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించలేదు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులతో వర్షాలు పడే సూచనలు ఉన్నందున రైతులు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరి ధాన్యం ఆరబోస్తూ, వాతావరణ మార్పులో మళ్లీ కుప్పపోస్తున్నారు. ధాన్యం తేమ శాతం వచ్చిందో లేదో.. చూసేందుకు కూడా అధికారులు సెంటర్ల వద్దకు వెళ్లడం లేదు.

కేంద్రాల్లో కానరాని వసతులు

అధికారులు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ వసతులు కల్పించలేదు. ఎండవేళలలో కూర్చునేందుకు గుడారాలు వేయకపోవడంతో పాటు మంచినీటి వసతిని ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా సెంటర్లలో కాంటా చేసేందుకు గన్నీ సంచులు రాకపోవడం, టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరుగాలం శ్రమించి వరి సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. సీజన్ ఆరంభం నుంచే పంటకు తెగుళ్లు సోకడంతో పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి పంటను పండించారు. కొంతమేర నష్టపోయిన మిగిలిన పంటను కోయించారు. ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తే.. ప్రభుత్వం సెంటర్లను ప్రారంభించినా కొనుగోళ్లు మొదలుపెట్టకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఆశతో ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో మార్పులతో వానలు పడే సూచనలు ఉన్నందున బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. అధికారులు వెంటనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించాలని కోరుతున్నారు.

కోనరావుపేట, ఏప్రిల్ 14

తొందరగా కొనాలె..

వడ్లను అమ్ముకోవడం కష్టమైతాంది. మొన్నటి దాకా పంట మంచి గలేక అడ్డగోలు మందులు కొట్టినం. ఇప్పుడు కోసిన పంటను సెంటర్‌లో పోస్తే కొనే టోళ్లులేరు. ఇగ రోజు వడ్లను ఆరబెడుతున్నాం. మబ్బులు ఏర్పడితే పొద్దుం దాక మళ్లీ వాటిని కుప్పపోస్తున్నాం. అధికారులు తొందరగా వడ్లు కొంటే మాకు తిప్పలు తప్పుతయి. వానకు వడ్లు తడువకుండా పరదలు ఇయ్యాలె.

– నెన్నెల్ల దేవయ్య, రైతు (నిజామాబాద్)

పేరుకే సెంటర్లు ఓపెన్ చేసిన్రు..

ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. నేను 12ఎకరాలలో వరి వేసిన. ఈ సారి పంట తెగుళ్లు సోకింది. వడ్లను కేంద్రంలో పోసి పది రోజులు కావస్తాంది. ఇప్పటివరకు సెంటర్‌ను ఓపెన్ చేయలేదు. రోజు తేమ శాతం కోసం ఆరబెట్టడం మళ్లీ సాయంత్రం వేళలో కుప్ప పోయడంతో ఇబ్బంది అయితాంది. అధికారులు వెంటనే వడ్లు కొనాలె.

– పెంతాల భూపతి, యువరైతు, (నిమ్మపల్లి)

పోపా సేవలు అభినందనీయం

పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈవో రఘుపతి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): పోపా సేవా కార్యక్రమాలతో సమాజాన్ని చైతన్యపరచడం అభినందనీయమని మండల విద్యాధికారి దూస రఘుపతి ప్రశంసించారు. ఆదివారం కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో పద్మశాలీ అఫిషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్, హంస హోమియోపతి కాలేజ్, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలీ విద్యార్థుల కోసం 45రోజుల పాటు నిర్వహించే పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు, ఉచిత హోమియోపతి వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోపా సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ తరగతులు నిర్వహించడం హర్షించదగ్గదన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 245మంది కి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ పోపా కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్, గాజుల ప్రతాప్, మచ్చ ఆనంద్, వాసాల హరిప్రసాద్, వైద్యులు సాయి, పత్తిపాక రఘు, ఈశ్వర్ ఉన్నారు.

తాటిముంజలు కోస్తుండగా..

- కాలుజారి కిందపడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: తాటిముంజలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారడంతో కిందపడి ఒకరు మృతి చెందిన ఘటన తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బీమరి దేవయ్య (57)కు మైసమ్మ చెరువు వద్ద వ్యవసాయ భూమి ఉన్నది. సదరు పొలం వద్ద ఉన్న తాటిచెట్టు ముంజలు కోసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ముంజలు కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోగా అక్కడికక్కడే మృతి చెందాడు. దేవయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నది. పోలీసులు జరిగిన ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

జగమేలు నాయక.. జయహో

వేములవాడ టౌన్, ఏప్రిల్ 14: శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ఉత్సవమూర్తులు నెమలి వాహనాలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7గంటలకు పట్టు పీతాంబరాలతో తేజోమయంగా అలంకరించిన నెమలి వాహనంపై శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారు, లక్ష్మీసమేత అనంత పద్మనాభస్వామివార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పురవీధుల్లో విహరింపజేశారు. ఇక్కడ పర్యవేక్షకుడు నాగుల మహేశ్, పూజల ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్ రెడ్డి, గట్టు గౌతమ్ ఉన్నారు.

నేటి నుంచి త్రిరాత్రోత్సవాలు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 14: శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి రాజన్న ఆలయంలో త్రిరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ పేర్కొన్నారు. సోమవారం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో పంచోపనిషత్తుల ద్వారా అభిషేక పూజలు చేస్తామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలను నివారిద్దాం

వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

కలెక్టరేట్, ఏప్రిల్ 14: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగిఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సంబంధితశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆదివారం ఆవిష్కరించి, మాట్లాడారు. జిల్లాలోని షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాల్స్, సినిమాహాల్స్, దవాఖానలు, స్కూల్స్, గోడౌన్, పరిశ్రమలు, ఆలయాల్లో మంటలు ఆర్పివేసే పరికరాల వినియోగంపై ఆయా సంస్థల్లో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణ యంత్రాలను పరిశీలించాలన్నారు. ఇక్కడ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, సిరిసిల్ల, వేములవాడ ఫైర్ ఆఫీసర్లు నర్సింహచారి, కమలాకర్, సిబ్బంది ఉన్నారు.

రక్తదాతకు పురస్కారం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్‌రెడ్డి ఇప్పటి వరకు 48సార్లు రక్తదానం చేయగా, తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. ఇక్కడ తెలంగాణ సమాచారశాఖ సంయుక్త సంచాలకులు వెంకటరమణ, దైవాజ్ఞశర్మ ఉన్నారు.

విప్ పరామర్శ

చందుర్తి, ఏప్రిల్ 14: రామారావుపల్లిలో ఇటీవల మృతిచెందిన గంగుల సత్తవ్వ, హార్ట్ ఓపెన్ సర్జరీ చికిత్స చేయించుకున్న ఎగోళం పరశురాములు కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఇక్కడ సింగిల్‌విండో మాజీ చైర్మన్ మస్కు ముకుందరెడ్డి, ఏగోళం శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ ముస్కు అజయ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

దవాఖానలో ఆపరేషన్ చేయించుకున్నవారితో వైద్యుడు రాజలింగం

పేదలకు కంటి చూపునివ్వడమే లక్ష్యం

బోయినపల్లి, ఏప్రిల్14: పేదలకు కంటి చూపునివ్వడమే బీసీఎం కంటి దవాఖాన లక్ష్యమని బీసీఎం వ్యవస్థాపకుడు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వైరాగ్యం రాజలింగం పేర్కొన్నారు. కొదురుపాక బీసీఎం కంటి దవఖానలో ఆదివారం 24మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసిన అనంతరం, ఆయన మాట్లాడారు. కొదురుపాకలో ఆధునాతన సౌకర్యాలతో కంటి దవాఖానను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు, అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు రీటా బహద్దూర్‌షా, తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 14: మిడ్‌మానేరులో ముంపునకు గురైన ప్రాంతంలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్‌తోపాటు అనుపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మట్టి అక్రమ దందాకు తెరలేపారు. ప్రాజెక్టులో నీరు తగ్గిపోవడంతో ఇదే అదనుగా భావించిన సదరు నాయకులు అనుమతులు లేకుండా దాదాపు 20రోజుల నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టి తరలిస్తుండగా, వచ్చే దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నామని రైతులు చెబుతున్నా పట్టించుకోకపోవడం లేదు. ఈ క్రమంలో ఆదివారం అనుపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టి తీస్తున్న ప్రాంతంలో తమకు ఇంకా పరిహారం రాలేదని, అక్కడి నుంచి మట్టిని తరలించవద్దన్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

మహనీయుల ఆశయ సాధనకు కృషి

గంభీరావుపేట, ఏప్రిల్ 14: మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని ముదిరాజ్ మహాసభల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు పిలుపునిచ్చారు. కోళ్లమద్దిలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు, ముదిరాజ్ సంఘ గ్రామాధ్యక్షుడు రవి, మండలాధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14: తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఆదివారం పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మోర శ్రీకాంత్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కందికట్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరికుంట శ్రీహరి, కోశాధికారిగా సామల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా సంతోష్, సాంస్కృతిక కార్యదర్శిగా అమర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇద్దరి బలవన్మరణం

కోనరావుపేట/వీర్నపల్లి, ఏప్రిల్14: వేర్వేరు కారణాలతో ఇద్దరు వృద్ధులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ముప్కం లక్ష్మీ రాజంగౌడ్(60) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ₹4లక్షల అప్పుచేసి ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆపరేషన్ కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలే అంటూ మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొన్నాడు. లక్ష్మీరాజంగౌడ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అలాగే వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాకు చెందిన భూక్యా సీతారాం రోజు మద్యం తాగొచ్చి ఇంట్లో గొడవచేసేవాడు. ప్రవర్తన మార్చుకోమని అతడికి పలుమార్లు చెప్పిన వినకపోవడంతో భార్య పంతులి(65) మనస్తాపం చెందింది. ఈ క్రమంలో ఆదివారం ఇంటి ఎదు ట చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
FINANCIAL SERVICES
★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం..